క్లుప్తంగా

రైతులకు నాణ్యమైన నారు అందించాలి



పెనుగంచిప్రోలు: రైతులకు నాణ్యమైన నారు అందించాలని, షేడ్‌నెట్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఉద్యాన శాఖాధికారి వర్ధిని అన్నారు. శుక్రవారం మండలంలోని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు, ముచ్చింతాల, శివాపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన షేడ్‌నెట్ నర్సరీలను ఆమె ఎంఏవో కె.రామసుబ్బారెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నర్సరీ దారులు నాణ్యమైన విత్తనాలు విత్తుకోవాలన్నారు. ప్రభుత్వం రూపొందించిన నియమ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన



నందిగామ టౌన్(చందర్లపాడు): చందర్లపాడు మండలంలోని పోపూరు గ్రామంలో ఎంపీ నిధులతో చేపట్టనున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణ పనులకు శుక్రవారం శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు శంకు స్థాపన చేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ఎంపీ నిధులు రూ.10 లక్షలతో ప్రహరీ నిర్మాణ పనులు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామాలలో అభివృద్ధి పనులతో పాటు కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రాధాన్యతనిస్తున్నారని చెప్పారు. కమ్యూనిటీ హాల్ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన విజయవాడ ఎంపీ కేశినేని నానికి ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శాకంబరి ఉత్సవాలు



నందిగామ: పట్టణ శివారు పల్లగిరిగుట్టపై త్రిశక్తి పీఠంలో శుక్రవారం శాకంబరి ఉత్సవాలు నిర్వహించారు. ఆలయంలోని కనకదుర్గ, కనకమహాలక్ష్మి, జ్ఞాన సరస్వతి అమ్మవార్లకు ముందుగా ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులు సమకూర్చిన పలు రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయ అర్చకుడు రాజేష్ శర్మ ఆధ్వర్యంలో విశేష పూజలతో పాటు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

మున్సిపల్ కమిషనర్



నందిగామ: వర్షాకాలం నేపథ్యంలో పట్టణ పరిధిలో దోమల నివారణకు అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం తెలిపారు. పట్టణంలోని 7వ వార్డులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణలో, ఖాళీ పాత్రలలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎక్కువ రోజులపాటు నీరు నిల్వ ఉండడం వలన దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. ముందు జాగ్రత్తగా పట్టణంలోని అన్ని వార్డుల పరిధిలో దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట పలువురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బూత్ స్థాయి అధికారులకు శిక్షణ

జగ్గయ్యపేట అర్బన్: ఈనెల 21 నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు నిర్వహించనున్న ఇంటింటి సర్వేకు సంబంధించి శుక్రవారం స్థానిక కొత్త కళ్యాణ మండపంలో 84–జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 222 మంది బూత్ లెవల్ అధికారులు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్పెషల్ సమరీ రివిజన్–2024 లో భాగంగా ఓటర్ల జాబితాలోని తప్పు ఒప్పులను గ్రహించి సమగ్ర ఓటరు జాబితాను రూపొందించే విధానం గురించి శిక్షణ ఇచ్చారు. ఈఆర్వో, ఏఈఆర్వోలు, ఎలక్షన్ సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సత్వర సేవలు

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- కొనసాగుతున్న జగనన్న సురక్ష



సభలో సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్(చందర్లపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు సత్వరమే అందుతున్నాయని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. చందర్లపాడు మండలంలోని కాసరబాద, వెలదికొత్తపాలెం గ్రామాల్లో జగనన్న సురక్ష క్యాంపులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ జగనన్న సురక్ష క్యాపులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని తీరుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వాల హయాంలో సర్టిఫికెట్‌లు కావాలంటే మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, కానీ సీఎం జగన్ పాలనలో రోజుల సమయం పట్టు సర్టిఫికెట్‌లు సైతం గంటల వ్యవధిలో మన ఊరిలోనే అందిస్తున్నారని కొనియాడారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ఆయా ప్రభుత్వాలు సంసిద్ధమవుతున్నాయని గుర్తు చేశారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుశీలాదేవి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు వెలగపూడి వెంకటేశ్వరరావు, వైఎస్ఎస్ ప్రసాద్, చింతోటి ప్రసాద్, వంకాయలపాటి భాను, రాయల జానకిరామయ్య, పలువురు నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్‌లు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనే సీఎం జగన్ లక్ష్యం

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- పల్లెంపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం



పల్లెంపల్లిలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పల్లెంపల్లి(వీరులపాడు): దేశ చరిత్రలో ఏ ప్రభుత్వానికి సాధ్యం కాని రీతిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మహన్‌రెడ్డి సంక్షేమ పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని కొణతాలపల్లి శివారు పల్లెంపల్లి గ్రామంలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఆయా లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన పథకాల వివరాల బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వంలో మాదిరిగా కాకుండా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు ఇచ్చిన ప్రతి ఒక్క హామీని విస్మరిస్తే.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం చెప్పిన వాటితో పాటు చెప్పనవి కూడా చేస్తున్నారని కొనియాడారు. సీఎం జగన్‌కు మద్దతు పలికి ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ నువ్వుల విశ్వనాథం, సర్పంచి నంద్రు సౌజన్య, ఎంపీటీసీ సభ్యురాలు అయిలూరి వెంకట్రావమ్మ, నాయకులు అయిలూరి నర్సిరెడ్డి, నరాల రాజేశ్వర్ రెడ్డి, గాంధీ, పలువురు నాయకులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ సర్టిఫికెట్లు అందజేత

నందిగామ: గ్రామీణ ప్రాంత మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ కమ్మినేని రవిశంకర్ అన్నారు. మండలంలోని మునగచర్ల సమీపంలో పీఎస్ బోస్ డ్రైవింగ్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ముగించారు. ఈ నేపథ్యంలో శిక్షణ పొందిన మహిళలకు శుక్రవారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రవిశంకర్ మాట్లాడుతూ మహిళలు టైలరింగ్ నేర్చుకోవడం వలన ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ పీ సుధీర్, పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



వత్సవాయి : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరం పదో తరగతి పూర్తి చేసుకున్న నలుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించినట్లు హెచ్‌ఎం ఆర్.అశోక్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోదెల శారద నూజివీడు ట్రిపుల్ ఐటీకి ఎంపిక కాగా మోదెల వైశాలి, యర్రబోయిన వసంత, అన్నవరపు దివ్యలు ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా సీట్లు సాధించిన విద్యార్థినులను హెచ్‌ఎంతోపాటు పాఠశాల అధ్యాపక బృందం అభినందించింది.

కంచికచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, మెరుగైన విద్యనందిస్తున్నామని ప్రధానోపాధ్యాయుడు పీ సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి షేక్ తస్లిమా రిహానా ట్రిపుల్‌ఐటీలో సీటు సాధించిన సందర్భంగా శుక్రవారం అభినందించారు. శ్రీకాకుళం ఐఐఐటీలో సీటు సాధించిన రిహానా ఉన్నత విద్యలో రాణించాలని ఆశీర్వదించారు. ఉపాధ్యాయులు షేక్ ఇస్మాయేలు, పుల్లారావు, ఆదిత్య, తదితరులు అభినందించారు.

■ జమ్మవరం(వీరులపాడు): మండలంలోని జమ్మవరం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి మంగళపూడి వంశీ శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన సందర్భంగా శుక్రవారం అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమాభారతి, ఎస్ఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



17న వాహనాల వేలం

జగ్గయ్యపేట: మద్యం కేసుల్లో పట్టుబడిన పలు వాహనాలకు ఈ నెల 17న ఈ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ ఎస్ఐ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. తొర్రకుంటపాలెంలోని ఎస్ఈబీ స్టేషన్ వద్ద ఉదయం 10 గంటల నుంచి వేలం నిర్వహిస్తున్నామన్నారు. ద్విచక్ర వాహనాలు 20, ఆటోలు నాలుగు వేలంలో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా ఆషాఢ సంబరం



ఆషాఢ సారెను ఊరేగింపుగా తీసుకువస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ బ్రహ్మం, తదితర భక్తులు

జగ్గయ్యపేట అర్బన్: ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా నకాశిబజారులో శ్రీకనకదుర్గ అమ్మవారికి శాకంబరీ అలంకారం నిర్వహించారు. దాతలు పలువురు భక్తులు సమర్పించిన కాయకూరలు, ఆకు కూరలతో అర్చకులు అయ్యప్ప దీక్షితులు అమ్మవారి మూలవిరాట్‌కు, ఉత్సవమూర్తికి, దేవాలయం ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. తొలుత అమ్మవారి ఉత్సవమూర్తికి పంచామృతాలు, పండ్ల రసాలు, ఆవుపాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రీతికరమైన కదంబ ప్రసాదాన్ని దేవస్థానం ఇంప్రూవ్‌మెంట్ ప్రైవేటు కమిటీ పంపిణీ చేసింది.పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారి దర్శించుకున్నారు.

శ్రీకనకదుర్గ అమ్మవారికి ఆషాఢ సారె..

ఆషాఢ మహోత్సవాల సందర్భంగా పట్టణంలో స్థానిక నకాశిబజారు లోని శ్రీకనకదుర్గ అమ్మవారి ఆలయంలో ఆషాఢ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. జగ్గయ్యపేట పట్టణానికి చెందిన మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మానేపల్లి బ్రహ్మం, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు బద్దూనాయక్, గోపాలకృష్ణ సొసైటీ అధ్యక్షుడు కోలపల్లి బుల్లిబాబు తదితరులు కుటుంబ సమేతంగా పాదయాత్రగా వచ్చి అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. కార్యక్రమంలో కనకదుర్గ అమ్మవారి దేవస్థానం ఇంప్రూవ్ మెంట్ ప్రైవేటు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉదయభానును కలిసిన వేదాద్రి దేవస్థానం ఈవో



ప్రభుత్వ విప్ ఉదయభానును కలిసిన వేదాద్రి దేవస్థానం ఈవో హేమలత

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మండలంలోని వేదాద్రి గ్రామంలోని శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన ఈవోగా నియమితులైన ఎస్.హేమలత ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఉదయభానును ఆయన నివాసంలో కలిసిన ఆమె మొక్కను అందజేశారు. ఉదయభాను ఆమెకు అభినందనలు తెలిపారు. దేవస్థానం అధికారులు పాల్గొన్నారు.

తప్పులు లేని ఓటరు జాబితా సిద్ధం చేయండి



నందిగామలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీ రావు

జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు

నందిగామ: తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం చేయాలంటే బూత్ లెవెల్ అధికారులు నమోదు చేసే సమాచారమే కీలకమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్ ఢిల్లీ రావు అన్నారు. పట్టణ శివారు మున్నేటి తీరాన ఆర్ఎస్ గార్డెన్స్‌లో శుక్రవారం సాయంత్రం ఇంటింటి రిసర్వేకు సంబంధించి బూత్ లెవెల్ అధికారులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 21వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు బీఎల్‌వోలు ఓటర్ల జాబితాపై ఇంటింటికీ వెళ్లి వెరిఫికేషన్ చేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. ఆగస్టు 24వ తేదీ నాటికి బీఎల్‌వోలు తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఎన్నికల కమిషన్ నిబంధనలు, ఇంటింటికి వెళ్లి వెరిఫికేషన్ నిర్వహిస్తున్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌ఓ కె.మోహన్ కుమార్, ఆర్డీవో ఆర్.రవీంద్రరావు, నందిగామ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం, నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లు, బూత్ లెవెల్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యే సమీక్ష



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

వీరులపాడు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తమ దృష్టికి వచ్చిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో తక్షణమే పరిష్కరించటం జరుగుతుందని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని వెల్లంకి, దాచవరం, పల్లెంపల్లి, కొణతాలపల్లి గ్రామాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజలు సీసీ రోడ్లు, డ్రెయిన్‌లు, కల్వర్టుల నిర్మాణంతో పాటు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అధికారులు కూడా అందుకనుగుణంగా పని చేయాలని తెలిపారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తు చేశారు. ఆ నిధులతో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరించనున్నట్లు చెప్పారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష శిబిరాలు

కంచికచర్ల : మండలంలోని కంచికచర్ల–2, పెండ్యాల–1 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష శిబిరాలు శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కే బాలశంకరరావు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు, ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ పాల్గొంటారు. ప్రజల సమస్యల పరిష్కరిస్తారని అన్నారు. జగనన్న సురక్ష శిబిరంలో లబ్ధిదారులకు 11 రకాల సేవలకు సంబంధించిన సర్టిఫికెట్లు అందజేస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

■ నందిగామ: పట్టణ పరిధిలోని 6వ సచివాలయం వద్ద శనివారం ఉదయం 9 గంటల నుంచి జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సోమవరం, కంచల గ్రామాల్లో సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమాలు జరుగుతాయని ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

■ పెనుగంచిప్రోలు: మండలంలోని ముచ్చింతాల, శనగపాడు, వెంగనాయకునిపాలెం గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న సురక్ష క్యాంప్‌లు జరుగుతాయని ఎంపీడీఓ ఎస్‌వీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

■ జగ్గయ్యపేట అర్బన్: జగనన్న సురక్ష కార్యక్రమం పట్టణంలో శనివారం రెండు సచివాలయాల్లో జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగమల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. సాయంత్రం 4 గంటలకు కోదాడ రోడ్‌లోని హీరో షూరూమ్ ప్రక్కన మైహోం అపార్ట్‌మెంట్ వద్ద 14వ సచివాలయం, సాయంత్రం 5 గంటలకు చెరువుబజారులోని రేణుకా పరమేశ్వరి ఆలయం వద్ద 6 వ సచివాలయానికి సంబంధించిన జగనన్న సురక్ష క్యాంపు జరుగుతుందని తెలిపారు. ఈ క్యాంపుల్లో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ముఖ్య అతిథిగా పాల్గొంటారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొంటారని తెలిపారు. ఈ క్యాంపుల్లో ఎలాంటి ఫీజులు వసూలు చేయకుండానే అర్హులైన వారికి కుల, ఆదాయ, జనన, మరణ, వివాహ ధ్రువీకరణ పత్రాలు, ఫ్యామిలీ సర్టిఫికెట్, రైస్ కార్డుల్లో మార్పు చేర్పులు, పట్టాదారు పాస్‌పుస్తకాలు తదితర 11 రకాల సర్టిఫికెట్లు, సర్వీసులు అందజేస్తామన్నారు.

నోటు పుస్తకాలు ఇవ్వాలని వినతి

కంచికచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు పంపిణీ చేయాలని ఎస్ఎఫ్ఐ నందిగామ డివిజన్ కార్యదర్శి గోపీనాయక్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ నాగుల్‌మీరాకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలతో పాటు ఏకరూప దుస్తులు కూడా ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం సీసాలు స్వాధీనం

గరికపాడు(జగ్గయ్యపేట): సరిహద్దు చెక్‌పోస్టు వద్ద తెలంగాణ నుంచి ఏపీకి అక్రమంగా తీసుకువస్తున్న 21 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ ఎస్ఐ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. తెల్లవారుజామున తెలంగాణ నుంచి కారులో మద్యం తీసుకువస్తున్నట్లు గుర్తించి కూకట్‌పల్లికి చెందిన నాగెండ్ల వరకుమార్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు.

శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

మైలవరం: ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు రెండు వారాలుగా నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ ఎల్. బాలు పేర్కొన్నారు. స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు స్మార్ట్ టీవీ, బైజూస్ కంటెంట్, ఐఎఫ్‌పీస్ అనే అంశాలపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీస్) మీద విద్యాభ్యాసం చేయడం, స్మార్ట్ బోర్డుల వాడకం, డిజిటల్ ఉపకరణాలు లోడ్‌చేసి విద్యార్థులకు ఎలా బోధించాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు.

ప్రారంభోత్సవానికి భవనాల ముస్తాబు



గ్రామంలో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం



రైతు భరోసా కేంద్రం

- రూ.55 లక్షలతో మూడు భవనాల నిర్మాణం
- నేడు బండిపాలెంలో భవనాల ప్రారంభోత్సవం



జగనన్న పాల వెల్లువ కేంద్ర భవనం

బండిపాలెం(జగ్గయ్యపేట): ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేస్తూ రైతన్నల సంక్షేమానికి రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తూ ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగానే గ్రామంలో నియోజకవర్గంలోనే మొట్టమొదటిగా ఏర్పాటు చేయబోయే వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌తో పాటు రైతు భరోసా కేంద్రం, జగనన్న పాల వెల్లువ నూతన భవనాలు శనివారం ప్రారంభం కానున్నాయి.

వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్..

బండిపాలెం గ్రామంలో రూ.17.5 లక్షల ఖర్చుతో ఆయుష్మాన్ భారత్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ భవనాన్ని అత్యాధునికంగా నిర్మించారు. ఈ భవనం అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు నిరంతర వైద్య సేవలు అందనున్నాయి.

జగనన్న పాలవెల్లువ కేంద్రం..

జగనన్న పాలవెల్లువతో మహిళా ఆర్థిక పురోభివృద్ధిలో ముందుకు సాగేందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పథకాన్ని ప్రారంభించారు. గ్రామంలో రూ.15.74 లక్షలతో పాలవెల్లువ కేంద్రాన్ని నిర్మించారు.

రైతు భరోసా కేంద్రం..

రైతు సంక్షేమానికి రూ.21.80 లక్షలతో గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని నిర్మించారు. భవనంలో వ్యవసాయ శాఖాధికారులతో పాటు రైతుల అవసరాలకు రైతు భరోసా కేంద్రం ఎంతో ఉపయోగపడనుంది.

నేడు ప్రారంభోత్సవం..

మూడు భవనాలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ప్రారంభించనున్నట్లు సొసైటీ చైర్మన్ కాసరగడ్డ రామారావు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడీసీ చైర్ పర్సన్ బండి పుణ్యశీల, వైఎస్సార్ సీపీ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్, పలువురు నాయకులు పాల్గొంటారని తెలిపారు.



సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నందిగామ డివిజన్
79950 92114 (నందిగామ)
99122 20547 (జగ్గయ్యపేట)
Office mail : sakshiads@gmail.com